క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



మరిడమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దొరబాబు

పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయనకు ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్ రామ్మోహనరావులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు తదితరులున్నారు.

అభ్యుదయానికి బాటలు వేసిన కవి యాసలపు



సూర్యారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

పెద్దాపురం: అభ్యుదయానికి బాటలు వేసిన కవి యాసలపు సూర్యారావు అని సాహితీ విమర్శకులు అద్దేపల్లి ప్రభు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. ప్రజా కవి యాసలపు సూర్యారావు 11వ వర్థంతి సందర్భంగా మంగళవారం సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన కవితా గోష్ఠి నిర్వహించారు. తొలుత సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అద్దేపల్లి ప్రభు, సూరిబాబు రాజు మాట్లాడుతూ యాసలపు సూర్యారావు సామాజిక అంశాలతో కూడిన అనేక కవితలను పుస్తక రూపంలో సమాజానికి అందించారన్నారు. కార్యక్రమంలో చల్లా విశ్వనాథం, నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, వంగలపూడి శివకృష్ణ, కూనిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రం వితరణ



దేవకికి వినికిడి యంత్రాన్ని అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం విద్యార్థిని గాది దేవకికి మండలం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వినికిడి యంత్రాన్ని అందజేశారు. స్థానిక మండల పరిషత్ పాఠశాలలో దేవకి నాగో తరగతి చదువుతున్న ఆమెకు క్లబ్ అధ్యక్షుడు కొపుల వెంకటేశ్వరరావు యంత్రాన్ని అందజేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైఎస్సార్ నాయుడు గోపి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జన జాగృతి సభను జయప్రదం చేయాలి



జన జాగృతి సభ కరపత్రాలను ఆవిష్కరించిన ఎంఆర్‌పీఎస్ నాయకులు

సామర్లకోట: జులై 7న విజయవాడలోని జింఖానా మైదానంలో జరిగే మాదిగల జన జాగృతి సభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య అన్నారు. స్థానిక పెన్షన్ లైన్‌లో జిల్లా ఎంఆర్‌పీఎస్ నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. అనంతరం జన జాగృతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు చిడిపి స్టాలిన్, వల్లూరి నాని, వల్లూరి సత్యవతి, కొమ్ము చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 6 నుంచి టీడీపీ బస్సు యాత్ర

సామర్లకోట: ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి వచ్చే నెల 6వ తేదీ నుంచి నియోజకవర్గ పరిధిలో బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ చౌక్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గాల్లో సమస్యలను గుర్తించి సెల్ఫీలు తీసి పార్టీ అధిష్ఠానానికి పంపుతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, అడబాల కుమారస్వామి, కంటే బాబు, బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బుడిబుడి అడుగులు

- ప్రభుత్వ పాఠశాలలకు క్యూ కడుతున్న విద్యార్థులు
- నాణ్యమైన విద్య, అత్యాధునిక వసతులు
- విప్లవాత్మకమైన విద్యా పథకాలు



వాకతిప్ప ఎంపీపీ పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: రాష్ట్రంలో విద్యా విప్లవం సాగుతోంది. కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. విద్యా వ్యవస్థపై ప్రభుత్వ వెచ్చిస్తున్న ప్రతి రూపాయికి విద్యార్థులు సార్థకత చేకూరుస్తున్నారు. ఫలితంగా బుడిబుడి అడుగుల పాపాయిలు, బుజ్జాయిలు సర్కారు బడివైపు పరుగులెడుతున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ సుమారు 2236 కొత్త అడ్మిషన్లు అయినట్లు అధికారులు చెబుతున్నారు.

విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఊతం..

డబ్బు లేదన్న నెపంతో ఏ పిల్లవాడూ చదువు ఆపకూడదన్న ఉన్నత లక్ష్యంతో సీఎం జగన్ ఎన్నో పథకాలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య, జగనన్న విద్యాకానుక, నాడు–నేడు వంటి అనేక పథకాలు విద్యార్థులకు అందజేస్తున్నారు. అలాగే నాడు–నేడు వంటి బృహత్తర కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. చదివితే ఇక్కడే చదవాలనిపించేలా అవసరమైన అన్ని మౌలిక వసతులతో ఆకర్షణీయంగా పాఠశాలలను తీర్చిదిద్దారు. కొత్తపల్లి మండలంలోనే 917 మంది వరకూ చేరినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో 17,696 మందికి జగనన్న విద్యా కానుక కిట్లను ఇప్పటి వరకూ అందజేశారు.

నాడు – నేడు పథకం కింద పాఠశాలలకు నిధులిలా..

మండలం	1వ విడత	నిధులు (రూ.కోట్లలో)	2వ విడతలో	నిధులు (రూ.కోట్లలో)
కొత్తపల్లి	21	4.36	36	20.55
గొల్లప్రోలు	15	5.99	37	20.91
పిఠాపురం	40	11	56	20.12

కొత్తపల్లి జెడ్పీ పాఠశాలలో నాబార్డు నిధులు రూ.2.1 కోట్లతో తరగతి గదులు నిర్మిస్తున్నారు.



పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు



నాడు-నేడు పథకంలో సుందరీకరించిన వాకతిప్ప ఎంపీపీ పాఠశాల

గణనీయంగా అడ్మిషన్లు



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విప్లవాత్మకమైన పథకాలు అమలవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు భారీగా వస్తున్నారు. కొత్తపల్లి మండలంలోని ఇప్పటి వరకూ సుమారు 917 మంది చేరారు. ఈ నెలాఖరు వరకూ కొత్త అడ్మిషన్లు జరుగుతున్నాయి. పిల్లలకు అందించే పౌష్టికాహారంలో ఈ ఏడాది రాగిజావ అందిస్తున్నాం.

– వేణుగోపాల్, ఎంఈఓ కొత్తపల్లి

ఉన్నతస్థాయికి తీసుకువెళ్లారు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థాయికి తీసుకువెళ్లారు. పాఠశాలల రూపురేఖలను మార్చి విద్యా వ్యవస్థకే ఆదర్శంగా నిలిచారు. ప్రతి విద్యార్థి దృష్టి ప్రభుత్వ పాఠశాలలపై పడుతోంది. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటారు.

–సీహెచ్ కృష్ణార్జునుడు, వాకతిప్ప ఎంపీపీ పాఠశాల

వసతులు బాగున్నాయి



ప్రభుత్వ పాఠశాలలో వసతులు, సౌకర్యాలు బాగున్నాయి. అందుకే ప్రైవేటు పాఠశాలను వదిలి ప్రభుత్వ పాఠశాలలో చేరాను. నాడు–నేడుతో పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించారు. విద్యా కానుక కిట్లలో పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేస్తున్నారు.

– ఎంకే దుర్గా శంకర్, ఐదో తరగతి, ఎంపీపీ పాఠశాల వాకతిప్ప

ఏలేరులో వ్యర్థాల విడుదలపై దాడులు

అనుమతులు లేని ప్లాంట్ సీజ్



ఏలేరులో వ్యర్థాలు కలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జితేంద్ర

పెద్దాపురం: మండలంలోని జి.రాగంపేట–వడ్లమూరు సరిహద్దు కాలువ ప్రాంతంలో కొంతమంది ఫ్యాక్టరీల వ్యర్థాలు, విషపూరిత యాసిడ్‌లను ఏలేరు నదిలో వదలడంపై రెవెన్యూ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. స్థానిక పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలే కాకుండా విశాఖపట్టణం నుంచి ఓ పరిశ్రమకు చెందిన యాసిడ్‌ను ఈ ప్రాంతంలో ఏలేరు నదిలో వదలడంతో సామర్లకోట మండలం శివారు పంట పొలాలు దెబ్బతింటున్నాయని ఉండూరుకు చెందిన తూము సుబ్బరాజు సోమవారం స్పందనను ఆశ్రయించారు. ఆర్డీఓ జేఎస్ రామారావు తక్షణమే చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేశారు. దీంతో తహసీల్దార్ జితేంద్ర మంగళవారం కలుషిత వ్యర్థాలు కలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఓ ప్లాంట్ నుంచి వ్యర్థాలను నేరుగా ఏలేరులో వదలడాన్ని గమనించిన ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యర్థాలు విడుదలయ్యే ప్రాంతాన్ని పూర్తిగా మూసివేసి ప్లాంట్‌ను సీజ్ చేశారు. ఏలేరులో ఎటువంటి వ్యర్థాలు వదిలినా సంబంధిత పరిశ్రమలపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- ఆనూరులో గడప గడపకూ మన ప్రభుత్వం



ఆనూరులో లబ్ధిదారుతో మాట్లాడుతున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : ప్రభుత్వం రాష్ట్రంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. పెద్దాపురం మండలంలోని ఆనూరు గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఇంటింటా ప్రభుత్వ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు గ్రామస్తుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలతో పాటు సంక్షేమ పథకాల అమలును తెలుసుకోవడానికి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికీ లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అర్హులైతే చాలు పారదర్శకంగా పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెంకే సత్యవతి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సర్పంచ్ నూకతాటి అనితారాణి, సర్పంచ్ కొత్త చక్రరావు, ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, సింగన త్రిమూర్తులు, కూనపురెడ్డి స్వామి, సింగన శివల, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గోపు మురళి తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



జిల్లా బాస్కెట్ బాల్ జట్టుతో జిల్లా ప్రతినిధులు, వైస్‌చైర్మన్ తదితరులు

సామర్లకోట: విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ అన్నారు. జిల్లా బాస్కెట్‌బాల్ బాలుర టీమ్ ఎంపిక నిమిత్తం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. ఈ నెల 23 నుంచి గుంటూరులో జరిగే అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు విజయం సాధించాలన్నారు. అదే విధంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన సమ్మర్ బాస్కెట్ బాల్ శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కాకినాడ జిల్లా బాస్కెట్‌బాల్ టీమ్‌కు సీహెచ్ ప్రసన్నాంజనేయులు, సీహెచ్ కిరణ్‌రాజ్, జి.రవికుమార్, జి.రామయ్యరాజు, జి.మోహన్ తేజ, కె.మణికంఠ, ఎ.నీరజ్‌శ్రీ,, కె.అర్జున్, సీహెచ్ నాగరాజు, కె.శామ్యూల్, సీహెచ్ వెంకటేష్‌లు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు కొండలరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కసిరెడ్డి కొండలరావు, కార్యదర్శి బండే కృష్ణార్జున్, ఉపాధ్యక్షుడు టీవీఎస్ రంగారావు, సహాయ కార్యదర్శి చెక్కా శేషగిరి, కనకాల వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్



జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్తిబాబు

పెద్దాపురం: ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందనివారిని గుర్తించి ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష పథకం ప్రారంభించారని పెద్దాపురం ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని తిరుపతి, ఉలిమేశ్వరం, కాండ్రకోట, మర్లావ తదితర గ్రామాల వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో జగనన్న సురక్ష కార్యక్రమంపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అశోక్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు భార్గవ్, శ్రీదేవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన పెంచాలి

సామర్లకోట: జగనన్న సురక్ష పథకంపై అందరికీ అవగాహన పెంచాల్సిన అవసరముందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాల్లో అమలు చేస్తున్న సేవలను మరింత ప్రచారం చేసేలా జగనన్న సురక్ష పథకం ఏర్పాటు చేశారన్నారు. ఈ పథకంలో కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, పట్టాదారు పాస్ పుస్తకాల నమోదు, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు, ఆధార్ మొబైల్ లింక్ వంటి సేవలను ఉచితంగా అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, పరిపాలనాధికారి వి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ పరికరాలు ప్రారంభం

- సామాజిక బాధ్యతగా సమకూర్చిన జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ
- సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు



ఫిజియోథెరపీ పరికరాల గదిని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ క్రైం: కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో (సీఎస్‌ఆర్) భాగంగా జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ జీజీహెచ్‌లోని ఫిజియోథెరపీ కేంద్రానికి కీలక పరికరాలు సమకూర్చింది. మంగళవారం ఈ పరికరాలను కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ రూ.3.25 లక్షలు విలువైన అధునాతన పరికర సంపత్తిని సమకూర్చిందనీ, రోగులు వీటి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్పొరేట్ సంస్థలు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిచేందుకు తమ వంతు సాయం అందించాలని కలెక్టర్ కోరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ పుష్కరరావు, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవోలు డాక్టర్ రాహుల్, డాక్టర్ యమున, ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనాథ్‌తో పాటు ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ వైద్యులు పాల్గొన్నారు.

ఉపా చట్టం కేసులు ఎత్తివేయాలి



దుర్గాడలో ఆందోళన నిర్వహిస్తున్న రైతు కూలీలు

పిఠాపురం: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ చైర్ పర్సన్ విమలక్క, మోహన్ బైరాగిలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టిన ఉపా చట్టం కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తు అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఆందోళన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ నేతృత్వంలో రైతులు, రైతు కూలీలు, ఉపాధి కూలీలు ఆందోళన నిర్వహించారు. తమ నేతలపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తి వేయాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు కుంచే అంజిబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధాంతపు చక్రరావు, దిమ్మిలి లోవరాజు, దయ్యాల పెదబాబు, శివకోటి రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పరికరాలపై నిర్లక్ష్యం



మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మూలన మగ్గుతున్న పారిశుధ్య పరికరాలు

సామర్లకోట: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలనే లక్ష్యంతో ప్రభుత్వం పంపిన పారిశుధ్య పరికరాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిరుపయోగంగా పడి ఉన్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ మిషన్లు, ఇన్‌ఫినేటర్లు(మలిన గుడ్డలను కాల్చే యంత్రం) సుమారు ఆరు నెలల క్రితం సామర్లకోట మండల పరిషత్ కార్యాలయానికి వచ్చాయి. వీటిని మండల పరిధిలోని గ్రామాలకు అందజేయాల్సి ఉండగా అధికారులు మాత్రం అలాగే వదిలేశారు. దీనివల్ల అవి పాడైపోయే అవకాశముందని మండల పరిషత్ సిబ్బంది నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎంపీడీఓ డి.శ్రీలలితను వివరణ కోరగా గ్రామ పంచాయతీలకు అందజేసి వాటిని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

ఉద్యాన పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం

జిల్లా ఉద్యాన శాఖాధికారి నేతల మల్లికార్జునరావు



అర్కిడ్ పూల సాగును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి మల్లికార్జునరావు

పిఠాపురం: ప్రభుత్వం ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు ఇస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి నేతల మల్లికార్జునరావు రైతులకు సూచించారు. ఆయన మంగళవారం పిఠాపురం మండలం అగ్రహారంలో నిర్మాణ దశలో ఉన్న కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. పోలీహౌజ్‌లో అర్కిడ్ పూల సాగును పరిశీలించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతు రైతులు ఉద్యాన శాఖాధికారుల సూచనలు సలహాలు పాటించడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. ఉద్యాన శాఖ సిబ్బంది కె.వెన్నెల, కె శివగణేష్, పి.శంకర్‌కుమార్, ఎన్.హిమబిందు రైతు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు జవ్వాది వీరబాబు పాల్గొన్నారు.

యోగా దినోత్సవానికి విద్యార్థుల స్వాగతం



యోగా ఆకారంలో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు యోగా ఇంగ్లిష్ అక్షరాల ఆకారంలో కూర్చుని అంతర్జాతీయ యోగా దినోత్సవానికి స్వాగతం పలికారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తాళూరి వైకుంఠం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు యోగా శిక్షణ నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. పాఠశాల విద్యార్థి కిల్లాడి యశ్వంత్ సెప్టెంబరులో థాయిలాండ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి మండల కమిటీలు ఏర్పాటు

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఒకటి కన్నా ఎక్కువ సమస్యలపై ప్రజలు దాఖలు చేసిన అర్జీల పరిష్కారానికి మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులతో కలిసి కమిటీలను ఏర్పాటు చేసినట్లు డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ ప్రతి సోమవారం ఉదయం సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమై వారి దృష్టికి వచ్చిన ఫిర్యాదుల విషయమై చర్చించి, అవసరమైతే సంయుక్తంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియో గం చేసుకోవాలని డీఆర్వో శ్రీధర్‌రెడ్డి కోరారు.

నిర్దేశిత లక్ష్యాలు పూర్తిచేయాలి

కరప: శాఖాపరంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసి, ప్రజలకు సేవలందించాలని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవాం రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, వీఆర్వోలతో ఆయన సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించి సూచనలు ఇచ్చారు. కొత్తగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని అన్నారు. గ్రామ సచివాలయాల్లో అమలుచేస్తున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడిగి తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీసర్వేను సకాలంలో పూర్తి చేసి, లబ్ధిదారులకు భూహక్కు పత్రాలు అందజేయాలని, ఓటర్ల జాబితాలో తప్పొప్పులు సవరించి, దోషరహిత జాబితా రూపొందించాలన్నారు. అనంతరం ఆర్డీఓ సత్యనారాయణ అధికారులతో కలసి నడకుదురులో పర్యటించి, రీసర్వే పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. తర్వాత గ్రామసచివాలయ భవన నిర్మాణపనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.